# మధ్యతరగతి చావు

● జగన్నాథశర్మ

● చిత్రాలు: అభిమన్యు




శేఖరం చనిపోయాడు. యాభైయేళ్ళన్నా నిండకుండానే 'హరీ'మన్నాడు.

నిన్న ఉదయం బాగానే ఉన్నాడు. కాఫీ తాగాడు. కబుర్లు చెప్పాడు. పేపర్ కోసం వచ్చి రాజకీయ చర్చ చేశాడు. మధ్యాహ్నం కూడా బాగానే ఉన్నాడు. ఆఫీసు నుంచి ఇంటికి - అంత దూరం సైకిల్ తొక్కుకుని వచ్చాడు. సీతాఫలాలు కొనితెచ్చాడు. డజను పది రూపాయలన్నాడు. ఇక కొనలేమన్నాడు.

రాత్రి కనిపించలేదు మరి. తొందరగా పడుకున్నాడనుకున్నాను. అర్ధరాత్రి 'గొల్లు'మన్నారంతా. చూద్దునో శేఖరం చనిపోయాడు. గుండెనొప్పితో పోయాడన్నారు.

శవాన్ని పెరటి గుమ్మంలో పెట్టారు. వీధి గుమ్మంలో వద్దని ఇంటివాళ్ళన్నారు.

నందివర్ధనం చెట్టు కింద, చాప మీద శవాన్ని పడుకోబెట్టారు. గుండెల వరకు దుప్పటి కప్పారు. తలకట్టున దీవం పెట్టారు. దాని పక్కగా శేఖరం కూతురు వనజ కూర్చుంది. కాళ్ళకట్టన అతని భార్య రత్నం కూర్చుంది. పిల్లాడు - రెండోవాడు చేతులు కట్టుకుని ద్వారానికి చేరబడి నిల్చున్నాడు.

పెద్దాడికి కబురెళ్ళింది. రాజమండ్రి నుంచి వాడు రావాల్సి ఉంది.

కోడి కూసింది. తెలతెలవారుతోంది. నాలుగ్గంటలయింది. అక్టోబర్ నెలాఖరి రోజులు. చలిచలిగా ఉంది. ఒకటీ రెండు చినుకులు కూడా పడ్డాయి.

చెల్లెళ్ళ పెళ్ళికి, తమ్ముడి చదువుకీ చేసిన అప్పులు తీర్చడానికి శేఖరం రాత్రీ పగలూ పనిచేసేవాడు. డొక్కు టైప్ మెషిన్ వాళ్ళింట తెల్లార్లూ వాగుతుండేది. వాళ్ళనీ వీళ్ళనీ అడిగి జాబ్ వర్క్ తెచ్చుకునేవాడు.

అయినవాళ్ళంతా ఏడ్చేసి అలిసిపోయారు. కళ్ళు మూతలు పడుతున్నాయి. బలవంతాన నిద్రనాపుకుంటున్నారు.

దగ్గర దగ్గరగా ఉన్న అప్పచెల్లెళ్ళొచ్చేశారు. ఊరిలో ఉన్న తమ్ముడు వచ్చేశాడు. శేఖరం భార్య తరపువాళ్ళు కూడా చాలామట్టుకొచ్చేశారు. ఉంటే గింటే ఒకరిద్దరు మాత్రం రావాల్సి ఉంది.

అంతా కబుర్లలో పడ్డారు. శేఖరం బాల్యం, యౌవనం, సరదాలు, సంతోషాలు, సహాయాలు, బాధలు, భయాలూ అన్నీ మాటల్లో దొర్లసాగాయి.

వేడి వేడిగా ఆరారా టీ అందుతోంది. తెచ్చి పోస్తున్నారు. శవజాగరణ సజావుగా సాగుతోంది.

ప్రథమ సంతానం శేఖరమే. తర్వాత ఇద్దరు ఆడపిల్లలు. ఆ తర్వాతివాడు తమ్ముడు.

శేఖరానికి పదేళ్ళప్పుడు తండ్రి పోయాడు. అప్పట్నుంచీ బరువు నెత్తికెత్తుకున్నాడతను. ఎలాగోలా ఎస్.ఎస్.ఎల్.సి అయిందనిపించాడు. చిన్నో చితకో ఉద్యోగం సంపాదించాడు. చెల్లెళ్ళ పెళ్ళి చేశాడు. తమ్ముణ్ణి సెవెన్త్ ఫారం వరకు చదివించాడు. అప్పటిగ్గాని తను పెళ్ళి చేసుకోలేదు. రత్నం కాపురానికి రావడం కూడా నాకు బాగా తెలును.

చెల్లెళ్ళ పెళ్ళికి, తమ్ముడి చదువుకీ చేసిన అప్పులు తీర్చడం కోసం శేఖరం రాత్రీ పగలూ పని చేసేవాడు. డొక్కు టైప్ మెషిన్ వాళ్ళింట తెల్లార్లూ వాగుతుండేది. వాళ్ళనీ వీళ్ళనీ అడిగి జాబ్ వర్క్ తెచ్చుకునేవాడు.

అందొచ్చిన తమ్ముడు పెళ్ళి చేసుకుని వేరింటి కాపురం పెట్టడంతో మరీ నిస్సహాయుడయిపోయాడు. ఈలోపు తన పిల్లలు పెద్దవాళ్ళవుతూ రావడం, వాళ్ళ చదువులు, ఖర్చుల కోసం యథాప్రకారం కష్టపడుతూ వచ్చాడు.

పెద్దాడి డిగ్రీ అయింది. ఏదో ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం వచ్చింది. పెళ్ళి కూడా అయింది. రాజమండ్రిలో నెట్టుకొస్తున్నాడు.

ఇంటర్ వరకు చదువుకుంది వనజ. పెళ్ళికి సిద్ధంగా ఉంది. నాలుగయిదు సంబంధాలు కూడా చూశారు. కట్నాల దగ్గర కలిసి రాలేదు. లేకపోతే ఆ పిల్ల పెళ్ళి కూడా చేసేసేవాడు. రెండో వాడు డిగ్రీ చదువుతున్నాడింకా.

సంబంధాలు కుదిరితే కుండమార్పిడికయినా సిద్ధమనేవాడు శేఖరం. రెండోవాడి చదువు పూర్తి కాకపోయినా, వాడికి ఉద్యోగం లేకపోయినా, ఇట్నుంచటు, అట్నుంచిటూ పెళ్ళిళ్ళు చేసి బాధ్యతలు తీర్చుకుంటాననేవాడు. అయితే, తీర్చుకోకుండానే పోయాడు.

తెల్లగా తెల్లారిపోయింది. పెరటి పిట్టగోడ మీదికి ఎక్కణ్ణుంచొచ్చాయో అయిదారు కోతులొచ్చాయి. కూర్చుని శవాన్ని, జనాన్ని చిత్రం చూస్తున్నాయి. వాటంతటవే పోతాయి. కసిరికొట్టి, లేనిపోని రభస చేయొద్దన్నారంతా. కానీ, లోలోపల

అందరికీ భయం భయంగా ఉంది. ఏదెవరి మీదికి దూకి రక్కుతుందోనని అంతా వాటినే గమనిస్తున్నారు.

రాజమండ్రి నుంచి పెళ్ళాంతో పెద్దాడు వచ్చేశాడు. వాళ్ళ రాక కొంత సంచలనం కలిగించింది. పెద్దపెట్టున ఏడుపు లంకించుకున్నారు తల్లీ కూతుళ్ళు. పెద్దాడెళ్ళి తల్లిని పొదువుకున్నాడు. వదినెగారు ఆడబడుచును అక్కున చేర్చుకుంది.

జరగాల్సిన తంతు ప్రారంభం కావాలి. ఎవరూ ఉలకరు, పలకరు. కర్మ చేయించే వంతుల్ని పిలవాలి. పాడె సామగ్రి తెచ్చుకోవాలి. ఒక్కరూ కదలడం లేదు.

కాఫీలు తాగి, పేపర్లు పట్టుకుని చుట్టుపక్కల వాళ్ళొచ్చేశారు. దహన కార్యానికి దండు తయారయింది. పెద్దాణ్ణి పిలిచి, పని ప్రారంభించమన్నారు. వాడు తెల్లమొహం వేసుకుని నిల్చున్నాడు.

"నెలాఖరు రోజులు. చేతిలో పైసా లేదు. కబురందే వేళకి ప్రయాణ ఖర్చులక్కూడా డబ్బుల్లేవు. తంటాలు పడితే అయిదొందలు అప్పు దొరికింది. చార్జీలు పోను, మూడొందలు మిగిలాయి'' అన్నాడు పెద్దాడు.

అంత్యక్రియలకి ఎలా లేదన్నా వెయ్యి రూపాయలు కావాలి. మూడొందలు ఏ ముక్కులో పెట్టను? కర్మ చేసే వంతులికే కనీసం నూటపదార్లివ్వాలి. ఇకపోతే కర్రలకి, కావిడికి, మిగిలిన తంతుకీ డబ్బెక్కడిది?

రెండోవాణ్ణి కేకేసి విషయం చెప్పాను.

"అమ్మకి చెప్పి చూస్తాను'' అని వెళ్ళాడు వాడు. తల్లితో మాట్లాడి వచ్చాడు.

"మీతో మాట్లాడాలట. అమ్మ రమ్మంటోంది'' అన్నాడు.

వెళ్ళాను.

రత్నం లేచొచ్చింది.

శవానికి కొద్ది దూరంలో ఇద్దరం నిల్చున్నాం.

"ఎలాగన్నయ్యగారూ, అయిదు పైసలు కూడా ఇంట్లో లేవు'' అన్నదావిడ.

"కబురందుకున్నవాడు ఖర్చెంతో ఉంటుందని, డబ్బుతో రావాలిగాని, చేతులూపుకుంటూ వస్తే ఎలా చెప్పండి? పెద్దాడి కిదేమయినా న్యాయంగా ఉందా?'' అడిగింది.

జరగాల్సిన తంతు ప్రారంభం కావాలి. ఎవరూ ఉలకరు, పలకరు.
కర్మ చేయించే వంతుల్ని పిలవాలి.
పాడె సామగ్రి తెచ్చుకోవాలి. ఒక్కరూ కదలడం లేదు.

"ఉంటుందుంటుంది. రెట్టించి అడగండి. డబ్బు వాడి దగ్గరుంచుకోడు. పెళ్ళాం దగ్గర దాస్తాడు. మళ్ళీ అడిగి చూడండి. బాధ్యత నీదేనని గట్టిగా చెప్పండి'' అన్నది.

"లేదంటున్నాడమ్మా'' అన్నాను.

వాణ్ణి మళ్ళీ అడగడం నాకిష్టం లేదు.

"లేదంటే ఎలాగండీ! తండ్రిని కాల్చడా'' అడిగింది.


శేఖరం అప్పచెల్లెళ్ళొచ్చారు దగ్గరికి. ఏమిటన్నారు. చెప్పాను.

"నిజమే! నెలాఖరు రోజులు. కష్టమే" అన్నారు. జీతాలందితే గాని శవాన్ని దహనం చేయడం వీలు కాదన్నట్టుగా మాట్లాడారు.

"ఆఫీసు వాళ్ళని అడిగి చూడండి'' అని సలహా ఇచ్చారు.

"ఇంత పొద్దున్నే ఎవరుంటారక్కడ? ఇస్తారన్న నమ్మకం ఏమిటి? అయినా, వాళ్ళకేం సంబంధం'' అన్నాను.

"మా బాగున్నారు మీరు. నెలంతా నా బొందేనని కష్టపడ్డాడా లేదా? జీతం ఇవ్వరూ'' అన్నారు.



నాలుగయిదు రోజుల్లో జీతాలిస్తారు. అందుకుని చచ్చిపోవాల్సింది. తప్పు పని చేశాడు శేఖరం.

రెండోవాణ్ణి కేకేశారు.

"నాన్నగారి ఆఫీసుకెళ్ళి ఇలా అని చెప్పి జీతం, ఇంకేమయినా ఇస్తే పట్టుకురా" అన్నది పెద్దత్త.

"ఈ నెల్లోనే బోనస్ ఇస్తారు. అడిగి చూడు'' అన్నది చిన్నత్త.

"అదీ ఇదీ కలిపితే నిక్షేపంలా లేచిపోతాడు'' అన్నారిద్దరూ. పరామర్శకి ఎవరో వస్తే అక్కణ్ణుంచి శవం దగ్గరికి వెళ్ళిపోయారు.

"దేనికని ఏడవనన్నయ్యగారూ! మొగుడు పోయాడని ఏడవనా! పోయిన వాణ్ణి కాల్చడానిక్కూడా డబ్బుల్లేవని ఏడవనా! ఏం బతుకులన్నయ్యగారూ మనవి'' అన్నది రత్నం. బోరు బోరున ఏడ్చింది.

"దహనానికే డబ్బుల్లేవు. రేపు ఎత్తిపోతలకి, దినాలకి ఎలాగన్నయ్యగారూ'' అని నెత్తి కొట్టుకుంది.

"రాత్రీ పగలూ కనీసం యాభై విస్తర్లు లేస్తాయి. ఈ పన్నెండు రోజులూ భోజనాల మాటేమిటి'' అన్నది.

సిగరెట్ తాగుతూ, గాల్లో చేతులూపుకుంటూ సంభాషిస్తున్న పెద్దాణ్ణి చూసి ఆమె కోపం పట్టలేకపోయింది.

"తండ్రికి తలకొరివి పెట్టడానికొచ్చాడంతే! రాకపోతే నలుగురూ తిడతారని వచ్చాడు. అంతేగాని, ఈ కుటుంబం కష్టనష్టాలు వాడికేమీ పట్టనట్టుంది" అంది రత్నం.

మాటలో మాటగా పెళ్ళయిందగ్గర్నుంచి పెద్దాడి ప్రవర్తన, వాడి పెళ్ళాం పడనివ్వకపోవడం అన్నీ ఏకరవు పెట్టిందామె.

భర్త మరణం కన్నా కొడుకు తమను పట్టించుకోకపోవడం పెద్ద సమస్యయిందామెకు.

ఇంతలో వెళ్ళినవాడు వెళ్ళినట్టే వచ్చేశాడు రెండోవాడు. నాలుగొందలు తెచ్చి తల్లి చేతిలో ఉంచాడు.

"మొన్న అయిదో తారీఖునే బోనస్ ఇచ్చేశారట! నిన్న పదిహేన్న సేలరీ అడ్వాన్స్ కూడా నాన్న తీసుకున్నారట. అప్పులు సొప్పులూ అన్నీ పోను ఇంతేనని ఈ నాలుగొందలూ ఇచ్చారు. ఇలా ఇలా అని వాచ్‌మన్ ఫోన్ చేస్తే మేనేజరుగారు, కేషియర్‌గారూ ఏకాయకీన వచ్చి లెక్కలు చూశారు.'' చెప్పాడు రెండోవాడు.

"అంత సొమ్మూ ఏం చేసినట్టు ఈయన?'' ఆశ్చర్యపోయింది రత్నం. శవాన్ని

గుచ్చి గుచ్చి చూసింది. ఆ చూపులో ఒక రకమయిన నిరసన వ్యక్తమయింది.

"ఎంత తోస్తే అంత! తనకు తోచింది చేయడం తప్ప, ఎవరి మాటా వినే రకం కాదన్నయ్యగారూ! ఇలా అనుకుంటున్నాను, ఇలా చేస్తే ఎలా ఉంటుందని ఇన్నేళ్ళ సంసారంలోనూ ఒక్కసారి కూడా నన్నడిగిన పాపాన పోలేదాయన. బోనస్ సొమ్ముతోనే కాబోలు ఈ పది పదిహేను రోజులూ వళ్ళు ఫలహారాలు తెచ్చి పోసేశారు" అన్నదామె.

"తోబుట్టువులు తోబుట్టువులంటూ కష్టాన్నంతా దోచి పెట్టారు. కష్టానికి, సుఖానికీ తోడొస్తారనేవారు, ఏపాటి వచ్చారో చూశారు కదా'' అన్నది మళ్ళీ.

''ఆయనొకందుకు పెళ్ళి చేసుకున్నారు. నేనొకందుకు కాపురం చేశానన్నట్టుంది. అంతా నా ఖర్మ.'' చేత్తో తల కొట్టుకుంది రత్నం. నాలుగొందలూ నా చేతిలో పెట్టి—

''కానివ్వండి'' అంది.

ముందు శవాన్ని కదిల్చి, తర్వాత సంగతి తర్వాత ఆలోచిద్దామనుకున్నాను. పెద్దాణ్ణి కేకేసి, వాడి దగ్గరున్న మూడొందలూ తీసుకున్నాను. చావు పెద్దరికం వహించాను. పని ప్రారంభించాను.


కొడుకులిద్దరూ స్నానాలు చేసొచ్చారు. ముండనమయింది. పాడె కడుతున్నారొక వక్క. అగ్గికుండ రాజుకుంటోంది.

నిన్న ఉదయం ఈ వేళకి శేఖరం సజీవంగా ఉన్నాడు. సరదా సరదాగా ఉన్నాడు. పేపర్లో కుక్కర్ల ప్రకటన చూసి ''ఈ కంపెనీ కుక్కర్ బాగుంటుందా" అని అడిగాడు. బాగుంటుందన్నాను.

'కొంటున్నానయితే. మిలట్రీ కేంటీన్లో తక్కువ ధరకి వస్తుందన్నాడు మా తమ్ముడు. వాడి చేతికి వెయ్యి రూపాయలిచ్చాను. రేపో మాపో తెస్తాడు. కుక్కర్ కొనమని రత్నం ఎప్పణ్ణుంచో అంటోంది. దాని కోరిక తీర్చేస్తున్నాను. ఈ విషయం ఇంట్లో ఎవరికీ తెలీదింకా - నీకూ, నాకూ, మా తమ్ముడికీ తప్ప'' అన్నాడు.

"చెప్పకూడదేదీ! చేసి చూపించాలంతే" అన్నాడు.

దాంతో తమ్ముడికి శేఖరం వెయ్యి రూపాయలిచ్చిన సంగతి గుర్తొచ్చింది. కుక్కర్ విషయం కదిపి, కొనకుండా ఉంటే వెయ్యి రూపాయలివ్వమని అతన్ని అడుగుదామనుకున్నాను. రెండడుగులు వేశాను కూడా. అంతలోనే ఆగిపోయాను:



అన్న ఇవ్వలేదని తమ్ముడు మాట మారిస్తే! లేనిపోని గొడవలు పెట్టకండని పెట్రేగిపోతే! రక్తసంబంధాల్లో తలదూర్చి తంపులు పెడుతున్నారేమిటి అంటే నేనేమయిపోవాలి? నోరు మూసుకోవడం క్షేమమనిపించింది.

చనిపోయింది అన్న కాదన్నట్టుగా, పరాయి వాడెవడో పోయాడన్నట్టుగా సంచరిస్తున్నాడు తమ్ముడు. అంటీ ముట్టనట్టుగా ఉంటున్నాడు. అతని జోలికి పోకుండా ఉంటేనే బాగుంటుందనుకున్నాను.

చనిపోయింది అన్న కాదన్నట్టుగా, పరాయి వాడెవడో పోయాడన్నట్టుగా సంచరిస్తున్నాడు తమ్ముడు. అంటీ ముట్టనట్టుగా ఉంటున్నాడు. అతని జోలికి పోకుండా ఉంటేనే బాగుంటుందనుకున్నాను.

శవానికి స్నానం చేయిస్తున్నారు.

రత్నాన్ని ఆపడం ఎవరి తరమూ కాకుండా ఉంది. అంతగా విలపిస్తోందామె. వనజ నన్ను చుట్టుకుంది.

''నాకు దిక్కెవరంకుల్! నన్నెవరు పట్టించుకుంటారంకుల్! నా పెళ్ళి ఎవరు చేస్తారంకుల్'' అని రాగాలు పెట్టింది. ఓదార్చలేకపోయాను.

పాడె లేచింది. శేఖరం తమ్ముడు, బావమరదులూ భుజాలు కాశారు. యాత్ర సాగింది. పిడికెడు బూడిదయిపోయాడు శేఖరం.

తంతంతా ముగిసేసరికి పన్నెండు వందలయింది. ఏడొందలు వాళ్ళిచ్చారు. అయిదొందలు నా చేతివి తగిలాయి. సాయంత్రం రత్నానికి ఈ విషయమే చెప్పాను. తగిలిన అయిదొందలూ తీర్చమని అడగడానికి చెప్పలేదు. ఇచ్చిన ఏడొందల్లో ఏమీ మిగల్లేదని తెలియడానికి చెప్పానంతా. ఎక్కడెక్కడ ఎంత ఖర్చయిందీ వివరించాను.

"మీ డబ్బులు మాకెందుకన్నయ్యగారూ! మీరెందుకు భరించాలి? సొంతవాళ్ళే ఆయన్ని చిన్నచూపు చూసినప్పుడు, మీరింకా నయం. స్నేహధర్మానికి కట్టుబడ్డారు. దగ్గరుండి అంతా చేయించారు. ఈ మూడొందలూ ఉంచండి. మిగిలిన రెండొందలూ రెండు వాయిదాల్లో ఇస్తాను'' అని వంద నోట్లు మూడు నా చేతికిచ్చింది రత్నం.

''ఇవెక్కడివి?'' అడిగాను.

''ఖర్చుల్లో ఉన్నావు. కావాలంటే మూడొందలిస్తాను. ఇస్త్రీ పెట్టె ఇచ్చిమని మా చిన్నాడబడుచు అడిగింది. అమ్మేశాను'' అన్నది రత్నం.

ఇచ్చిన డబ్బును తిరిగి ఇచ్చేయబోయాను. వద్దు వద్దన్నదామె.

''చిన్నాడికేమీ అంతు చిక్కకుండా ఉంది. డిగ్రీ ఎలా గట్టెక్కుతానని భయపడుతున్నట్టున్నాడు. వాడికి కాస్త ధైర్యం చెప్పి చూడండి'' అన్నది.

సరేనన్నాను. గుమ్మం దిగుతోంటే, ఎవరో ఇద్దరు వ్యక్తులు ఎదురయ్యారు. వాళ్ళలో ఒకరి చేతిలో ఎక్సర్‌సైజు నోటు పుస్తకం ఉంది. దాన్ని పట్టుకున్నతను - "దిక్కులేని ముసిల్ది సార్! చచ్చిపోయింది. దహనానికి మీకు చేతనయిన సాయం చేయండ్సార్" అని అడిగాడు. పుస్తకాన్ని అందించాడు. ఎవరెవరి పేర్లో ఉన్నాయందులో. పేర్ల కెదురుగా వారిచ్చిన ధనసహాయం అంకెల్లో వేసి ఉంది. శేఖరం తమ్ముడి పేరు కూడా ఉంది. దాని కెదురుగా అయిదంకె ఉంది. దానకర్ణుడనుకున్నాను. నవ్వొచ్చింది.

అనాథ ప్రేతసంస్కారం మహాపుణ్యం. అందుకందరూ ముందుకొస్తారు. పాపం! శేఖరం అనాథయినా కాకపోయెననుకున్నాను. ■